క్లుప్తంగా

బస్‌పాస్ సర్వీస్ చార్జీ చెల్లింపు

గద్వాల క్రైం: పేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు ప్రభుత్వం రాయితీ బస్సు పాసులను అందజేస్తోంది. అయితే బస్‌పాస్ పొందేటప్పుడు సర్వీస్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా విద్యార్థులకు భారం కాకూడదని ఉద్దేశ్యంలో ఒకే మొత్తంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం చెల్లించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే రూ. 2.50లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వరుణుడి కరుణ కోసం పూజలు



శాంతినగర్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో కాటమన్న స్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజాసేవతోనే గుర్తింపు

అలంపూర్: ఉద్యోగ జీవితంలో ప్రజలకు అందించిన సేవలతోనే గుర్తింపు వస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడు రంగముని పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై రంగముని దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు పుష్పలత, సుదర్శన్ గౌడ్, ఇంతియాజ్, కో–ఆప్షన్ సభ్యులు అల్లబఖష్, నాయకులు నాగరాజు, మున్సిపల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లు పంపిణీ



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాజెక్ట్ పరిధిలోని మానవపాడు, ఉండవెల్లి, ఇటిక్యాల మండలాలకు ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా మండలాల సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ సెంటర్లకు నాణ్యమైన గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 58 సెంటర్లకు 1100 గుడ్లను పంపిణీ చేసినట్లు సూపర్‌వైజర్ ఆస్మా తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా లేక అవస్థలు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడం లేదు. దీంతో తాగేందుకు నీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్‌భగీరథ లీకేజీ వల్ల నీరు అందడంలేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో కనీసం బోరుల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ తేజవర్ధన్‌ను వివరణ కోరగా పైప్ లైన్ లీకేజీని కారణంగా సమస్య తలెత్తిందని వెంటనే మరమ్మతు చేపట్టి శనివారం నాటికి తాగునీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

పేస్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వానికి లేఖలు



గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపచేయాలని మాచర్ల కూలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్పంచ్ సిద్ధిరామప్ప, ఉపాధి కూలీలు కలిసి ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది 18 ఏళ్లుగా 18 రకాలైన శాఖలతో కలిసి పనిచేస్తున్నారు. ఉపాధి ఉద్యోగుల వలన గ్రామాల్లో కూలీలకు ఉపాధి లభించడంతో పాటుగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కూలీలు వివరించారు. తెలంగాణలో 70 మంది శాసనసభ్యుల ద్వారా ఉపాధి ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని ఇచ్చిన లేఖలను ప్రభుత్వానికి అందజేసిన విషయాన్ని కూలీలు గుర్తు చేశారు. మాచర్లలో 200 మంది కూలీలతో పాటుగా సర్పంచ్ సిద్ధిరామప్ప ఉపాధి ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని సంతకాలు చేశారు. కూలీలు సంతకాలు చేసిన లేఖలను ఏపీఓ ప్రసాద్‌కు అందజేశారు. వీటిని ప్రభుత్వానికి పంపనున్నట్లు ఏపీఓ తెలిపారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



చిన్న ధన్వాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ అభిమతమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం మండలంలోని ముండ్లదిన్నెలో అంగన్‌వాడీ భవనానికి రూ.5 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి, చిన్న ధన్వాడలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబంధు, దళితబంధు, రైతుబీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం ముండ్లదిన్నెలో పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, పెద్దింటి నాగేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జేమ్స్, శ్రీనివాస్ గౌడ్, కాశపోగు రాజు,రవి రెడ్డి , వెంకట్రామన్ గౌడ్, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. అదేవిధంగా మండలంలోని వేణిసోంపురంలో రూ. 36 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

కులవివక్ష పాటిస్తే చర్యలు



మల్దకల్ గ్రామస్తులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ నర్సన్న



ఈర్లబండలో..

మల్దకల్: మండల కేంద్రంలో సర్పంచ్ యాకోబు ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నర్సన్న, ఆర్‌ఐ రామకృష్ణ హాజరై మాట్లాడారు. గ్రామాలలో రెండు గ్లాసుల పద్ధతి అవలంభిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఈరన్న, బద్రి, రాములు, మునేప్ప తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈర్లబండ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కులపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని పెద్దఆమదాలపాడులో తహసీల్దార్ ధరణి షా పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీ కాంత్‌రెడ్డి, సర్పంచ్ నారాయణ, పోలీస్‌లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



అలంపూర్ చౌరస్తాలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీరభద్రప్ప



ఇటిక్యాలలో ..

అలంపూర్: చౌరస్తాలో గ్రూప్–4 పరీక్ష కేంద్రాలను ఉండవెల్లి తహసీల్దార్ వీరభద్రప్ప శుక్రవారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో భాగంగా ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విశ్వశాంతి డిగ్రీ కళాశాల, విశ్వశాంతి ఇంటర్ మీడియట్ కళాశాల, ప్రయాగ్ పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వసతులను తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీఓ పద్మావతి, డిప్యూటీ తహసీల్దార్ జయంతి, ఆర్‌ఐ సుచిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ రెడ్డిలు పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలో పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్స్‌తో ఎంఈఓ, చీఫ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 240 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మంది, మాంటిస్సోరి పాఠశాలలో 576 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ఉపాధ్యాయులు 12 మంది ఇన్విజిలేటర్స్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రూప్–4 పరీక్షపై ఇన్విజిలేటర్లతో చీఫ్ సూపరింటెండెంట్ నరసింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి శ్యామ్యూల్ సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పరీక్ష హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సమావేశంలో లైజన్ ఆఫీసర్ రమణారావు, డిపార్ట్‌మెంటల్ అధికారి శామ్యుల్ 12 మంది ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో నిర్వహించే గ్రూప్–4 పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను చీఫ్ సూపరింటెండెంట్ తిరుపతయ్యతో కలిసి పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

కంది విత్తనాల పంపిణీ



గట్టు: మండలంలోని బోయలగూడెం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పీఆర్‌జీ–176 రకం కంది విత్తనాలను వైస్ ఎంపీపీ సుమతి, ఏఈఓ భక్తవత్సల పంపిణీ చేశారు. మొత్తం 35 చిరు బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. సాగులో మెలకువలను పాటించి అధిక దిగుబడులను సాధించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన



మానవపాడు: మండలంలోని ఏ.బుర్దిపాడు నుంచి పైపాడు గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఏఈ నరేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ పనులను రూ. 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీ పథకాలపై ఇంటింటి ప్రచారం



తక్కశిలలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కర్ణాటక విస్తారక్ సుగుణ, నాయకులు



ఇటిక్యాల మండలం ఉదండాపురంలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, షాబాద్ గ్రామాలలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనను పురస్కరించుకొని జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కర్ణాటక విస్తారక్ మంజునాథ్ హాజరై గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, కృష్ణ, సత్యారెడ్డి, అశోక్, బూత్ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో జన్‌సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్ణాటక విస్తారక్ సుగుణ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పటేల్ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేశ్వర్లుతో కలిసి ఇంటింటికీ కరపత్రాలను, స్టికర్లు అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి మహేంద్ర, లక్ష్మీనారాయణ, సుంకన్న, బాలకృష్ణ, మధు, గోపాల్, పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గోపాలకృష్ణ, పరుశరాం, వీరన్న, పాల్గొన్నారు.

ఆరోగ్య కాంపులు ఏర్పాటు చేయాలి



బీపీ మిషన్లను పంపిణీ చేసిన వైద్యాధికారులు

గట్టు: గ్రామాల్లో ఆరోగ్య కాంపులు ఏర్పాటు చేయాలని ప్రోగ్రామ్ వైద్యాధికారి రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలకు కొత్త డిజిటల్ బీపీ ఆపరేటర్లను ఇన్‌చార్జ్ వైద్యాధికారి హరీష్ తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌పై రివ్యూ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారులు హరీష్, రాజులు మాట్లాడుతూ కొత్త బీపీ మిషన్లు ఒక్కసారి రిచార్జ్ చేస్తే 400 మందికి బీపీ చెక్ చేయొచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 30 సంవత్సరాలు నిండిన వారందరికి ప్రజాప్రతినిధుల సహాయంతో స్క్రీనింగ్ చేయాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీలోగా ఆశా కార్యకర్తలు మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ కోర్డినేటర్ శ్యాంసుందర్, సూపర్‌వైజర్ మక్బూద్, స్వర్ణలత, సీహెచ్ఓ డీసేని, హెల్త్ అసిస్టెంట్లు సోమశేఖర్, వెంకటాద్రి నాయుడు, మల్లేష్, ఆయా సబ్ సెంటర్ల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా వాసవీమాత



శాకంబరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకంబరి దేవిగా భక్తులతో పూజలందుకున్నారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్ కుమార్, ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో చక్కగా అలంకరించారు. వాసవీ అష్టోత్తర శతనామ పూజ, లలితా సహస్రనామాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, వ్యాపారాలు మంచిగా జరగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీర, సారె ఒడిబియ్యం సమర్పించారు. గోరింటాకు ఉత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఫల పుష్పాలు నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహా మంగళ హారతితో కార్యక్రమాలు ముగిసాయి.

లాడ్జిలో పోలీసుల తనిఖీలు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో పట్టణ పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రామస్వామి మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అందుకున్న సమాచారం మేరకు లాడ్జిలో తనిఖీలో చేశామన్నారు. బస చేసిన వారి వివరాలు తెలుసుకున్నారు. ఐడీ కార్డులను పరిశీలించారు. అనుమానాస్పందంగా ఉన్న ఇద్దరు యువతులు, నలుగురు మహిళలు, మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఉండవెల్లిలోని బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

ఉండవెల్లి: కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకట్రమణ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బిచ్చల ప్రసాద్‌కు పది నెలల కిందట ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతో బాధితుడి భార్య సుజాతకు రూ.2 లక్షల చెక్కును ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వివిధ గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలను కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్, రాము, జగన్మోహన్ నాయుడు, ఉపాధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్‌లు నాగేష్, నరెందర్, నాయకులు నర్సన్‌గౌడ్, నయీం, రమేష్, రాజురెడ్డి, మద్దిలేటి, పాండు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని 20వ వార్డులో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మధుకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బూత్ లెవల్, మహిళా కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా సేవాదళ్ అధ్యక్షురాలు సులోచనమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రుక్మంధర్‌రెడ్డి అన్నారు. ఇటిక్యాల మండలంలోని జింకలపల్లిలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, వెంకటన్న, రవి, అంజి, ఉన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని నిరసన



గద్వాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: అర్హులైన పేదలందరికి ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ, కార్మిక సంఘం, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహ మాట్లాడారు. పట్టణంలో ఇంటి స్థలాలు, ఇళ్లు లేక పేదలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, వేల ఎకరాల ప్రభుత్వ భూమి కట్టబెడుతోందని, భూకబ్జాదారుల ఇష్టానుసారంగా భూములను ఆక్రమిస్తున్నారని వివరించారు. గృహలక్ష్మి పథకం ద్వారా రూ.5,50,000లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీతారాములు, నర్సింహులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

అయిజ: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శుక్రవారం పట్టణంలో 8వ వార్డులోని భరత్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. శానిటేషన్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా, వీధిలైట్లు వెలుగుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో పెరిగిన ముళ్ల పొదలను సిబ్బందితో తొలగింపజేశారు. పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వాటర్ లైన్‌మెన్ నరసింహులు, బిల్ కలెక్టర్లు నాగరాజు, నరేష్, అడివన్న, ఆంజనేయులు, వీరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం

మానవపాడు: ప్రతి ఒక్కరికి సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సైబర్‌నేరాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులకు చెప్పొద్దన్నారు. అనుమానితులు గ్రామాల్లో కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటీపీ, పేటీఎం, గూగుల్‌పే ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మేసజ్‌లకు స్పందించొద్దన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

మల్దకల్: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని సీడీపీఓ కమలాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయంలో మల్దకల్, గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టికాహారం పంపిణీతో పాటు విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, యామిని, బాలమ్మ, తెల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సామాజిక అంశాలపై అవగాహన



గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓ వాయిస్ 4 గర్ల్స్ సంస్థ బాలికలకు వివిధ అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం విద్యార్థినులకు విద్య, ప్రాథమిక హక్కులు, హింస, సంస్కృతి, ఆత్మ పరిశీలన, యుక్తవయస్సులో వచ్చే రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలపై ట్రైనర్ సౌమ్య అవగాహన కల్పించారు. బాలికల్లో ఆత్మస్థైర్యం, సామాజిక అంశాలు, జీవన నైపుణ్యాలపై పెంపొందించడం కోసం వాయిస్ 4 గర్ల్స్ టీం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలలకు లైబ్రరీ ర్యాక్‌లు అందజేత

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం సీఆర్‌పీ యుగంధర్, శివరాజ్ ఉపాధ్యాయులకు లైబ్రరీకి సంబధించిన ర్యాక్స్ వారు పంపిణీ చేశారు. మండలంలోని కొండాపురం, ఇర్కిచేడు, వెంకటాపురం, మల్లాపురంతండా, చింతలకుంట, ఉమిత్యాల, ఉమిత్యాలతండా, మైలగడ్డ, ఈర్లబండ, గంగన్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు ర్యాక్స్ మంజూరయ్యాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు మురళి, నర్సింహులు, స్వామి, ఈశ్వర్, పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులపై కాలనీవాసుల ఆగ్రహం



ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న కాలనీవాసులు

జోగుళాంబ శక్తిపీఠం: అంతర్గత రోడ్లు నిర్మించడం లేదని ఆరో వార్డులోని తెలుగువీధి ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీశారు. శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి, కౌన్సిలర్‌లు సుదర్శన్ గౌడ్, ఇంతియాజ్‌లు వార్డులో అంతర్గత రోడ్లను పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌కు సంబంధిత వార్డు కౌన్సిలర్‌పై కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ సుష్మా పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లను ఎందుకు నిర్మించడం లేదని కౌన్సిలర్‌ను ప్రశ్నించారు. అనంతరం నేతాజీ చైతన్య సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్ శర్మ, వెంకట్రామయ్య శెట్టిలు మున్సిపల్ చైర్ పర్సన్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. 15 రోజుల్లో అంతర్గత రోడ్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూరిబాబు, ప్రసాద్, పవన్, రాంబాబు, రాము, శారద, శాంతమ్మ, లావణ్య, తదితరులు ఉన్నారు.